నేడు చింతలపూడిలో

హోంమంత్రి అనిత పర్యటన

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చింతలపూడి మండలంలో బుధవారం పర్యటించనున్నారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఉదయం పది గంటలకు చింతలపూడి మండలంలోని ఆంథోనినగర్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పట్టణంలోని ఆర్‌కె కన్వెన్షన్ హాలులో జరిగే సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు.

చేపల చెరువులే ముద్దు..

వరి రైతులు వద్దు..!

ఉంగుటూరు మండలం రావులపర్రు ఘటనే నిదర్శనం

గతంలో నిడమర్రు మండలంలో ఇదే తరహా ఘటనలు అనేకం

నారుమడులు, పంటలు ముంచేస్తున్నా చర్యలు తూతూమంత్రమే

నారుమడులు మునిగినా ఏంకాదంటూ అధికారుల ప్రకటనలు హాస్యాస్పదం

ప్రజాప్రతినిధులు, అధికారులంతా చేపల చెరువుల యాజమానులకే వత్తాసు

వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారుల తీరుపై రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నీటమునిగిన నారుమడి

'వరి పంటను దెబ్బతీస్తే.. చేపలు తిని బతుకుతారా' అంటూ గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేసిన కాటంనేని భాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇవి. చేపల యజమానులకు వత్తాసు పలుకుతూ వరి సాగును దెబ్బతీసే చర్యలకు దిగుతున్న అధికార యంత్రాంగం తీరుపై అప్పట్లో కలెక్టర్ భాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉంగుటూరు మండలం రావులపర్రు ఘటన అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. చేపల చెరువుల యజమానులకు లాభం చేకూర్చేందుకు 150 ఎకరాలకు సంబంధించి వరి నారుమడులను ముంచేసిన పరిస్థితి నెలకొంది. రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగితే తప్ప వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో కదలిక లేకుండా పోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో డెల్టా ఆయకట్టు పరిధిలో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా చేపల చెరువుల తవ్వకాలు సాగించిన యాజమానులకు ప్రజా ప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకూ అంతా వత్తాసు పలుకుతూ వరి సాగు చేసే రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారు. ఉంగుటూరు మండలం రావులపర్రు లాకుల వద్ద నీరు పూర్తిస్థాయిలో మురుగుబోదెలోకి వెళ్లిపోతే చేపల చెరువులకు నష్టం వాటిల్లుతుందని చెక్కలు ఆడ్డుగా వేస్తున్న పరిస్థితి. దీంతో నీరు వెనక్కి ఎగదన్ని పెద్ద ఎత్తున నారుమడులు మునిగిపోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటో చెప్పనక్కర్లేదు. నారుమడులు దెబ్బతిని రైతులు లబోదిబోమంటూ రోడ్డెక్కితే అధికారులు, ప్రజాప్రతినిధులు చేపల చెరువుల యాజమాన్యాలకు అండగా మాట్లాడుతున్న తీరు అత్యంత దారుణమని చెప్పొచ్చు. నారుమడులు మునిగి రైతులు తీవ్ర ఆవేదనలో ఉంటే నాలుగు రోజులు నీటిలో మునిగినా ఏమీ కాదంటూ అధికారులు చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గంగా ఉన్నాయి. నారుమడులు మునగడానికి దారి తీసిన పరిస్థితులపై మాట్లాడకుండా అందుకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. స్థానిక ఎంఎల్ఎ సైతం చేపల చెరువుల యజమానులకు అండగా నిలుస్తున్నారంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. రావులపర్రు ఘటనే కాదు. ఉంగుటూరు నియోజవకర్గంలోని నిడమర్రు మండలంలోనూ చేపల చెరువుల కోసం వరి పంటలను సైతం ముంచేసిన ఘటనలు అనేకం జరుగుతూనే ఉన్నాయి. రైతులు రోడ్డెక్కినప్పుడు తాత్కాలిక చర్యలు తీసుకోవడం తప్ప వరి రైతులకు ఇబ్బంది లేకుండా శాశ్వత చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

నిడమర్రు మండలంలోనే అనేక ఘటనలు

నిడమర్రు మండలం అడవికొలనులోనూ చేపల చెరువుల కారణంగా వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉప్పునీటి రొయ్యల సాగు చేస్తూ ఆ నీటిని పంట పొలాల్లోకి వదిలేస్తున్నారు. దీంతో అడవికొలను గ్రామంలోని కలందాకోడు పాయ పంటలు పండని పరిస్థితి నెలకొంది. పంట పక్వానికి వచ్చే దశలో నీరు వదిలేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దీనిపై తహశీల్దార్, జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులు ఆందోళనలు చేసిన ఘటనలు ఉన్నాయి. ఉంగుటూరు నియోజకవర్గంతోపాటు, అనేక నియోజకవర్గాల్లో వరి రైతుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చేపల చెరువుల యాజమాన్యాల నుంచి మామూళ్లు దండుకుని వరి రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేపల చెరువులు సాగు చేసుకుంటున్న యాజమానులు పంట కాలువలను బాగు చేసేందుకు ఏమాత్రమూ సహకరించడం లేదని రైతులు చెబుతున్నారు. పంట కాలువలను ఆక్రమించుకుని నీరు కిందకు దిగకుండా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సరిగ్గా వ్యవహరించకపోవడం కారణంగా వరిసాగు ఇబ్బందుల్లో పడుతుందన్న చర్చ రైతుల్లో కొనసాగుతోంది. రావులపర్రు రైతుల పరిస్థితి మరెక్కడా రాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

జ్వరంతో ఒక్కరూ మరణించకూడదు

వైద్యాధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

జిల్లాలో వైరల్ జ్వరాల కారణంగా ఎటువంటి మరణాలు సంభవించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లా వైద్యాధికారులు, జిల్లాలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు వైద్యాధికారులతో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వైరల్ జ్వరాల బారిన ఎవరూ పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైరల్ జ్వరాలతో ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారికి తక్షణం వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఏదైనా మరణం సంభవిస్తే సంబంధింత వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు వ్యాప్తి అధికంగా ఉందని, వైరల్ జ్వరాలు ఎక్కువగా నమోదైన ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి ఆయా ఇళ్ల పరిసర ప్రాంతాల్లో ప్రతి ఇంటినీ ఎఎన్ఎం, ఆశా సిబ్బంది సందర్శించి ఫీవర్ సర్వే చేయాలన్నారు. వైరల్ జ్వరాల నియంత్రణకు అవి వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా, మురుగునీరు లేకుండా చూడాలన్న అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. జిల్లా వైద్య శాఖాధికారి, డివిజనల్ అధికారులు వైరల్ జ్వరాలు ఎక్కువగా నమోదైన గ్రామాల్లో, ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసి, పరిస్థితులను పరిశీలించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పిజె.అమృతం, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ పాల్ సతీష్, ఎన్‌టిఆర్ ఆరోగ్య ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, జిల్లా మలేరియా నిర్మూలన అధికారి డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

గ్రామ స్థాయి నుంచి సిపిఎంను బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై రాజీలేని ప్రజా పోరాటాలు కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం పిలుపునిచ్చారు. మంగళవారం రెండో రోజు సిపిఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశాలు స్థానిక యుటిఎఫ్ హాల్లో జరిగాయి. ఈ సమావేశాలకు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశాలు ప్రారంభ సూచకంగా పార్టీ జెండాను నాయకులు పసల సూర్యారావు ఆవిష్కరించారు. సిపిఎం అగ్ర నాయకులు కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు. జిల్లాలోని పలు ప్రజా సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలపై సిపిఎం నిత్యం పోరాటాలు చేస్తోందని, పేద, మధ్య తరగతి ప్రజలకు, కార్మికులు, రైతాంగానికి సంబంధించిన అనేక సమస్యలపై సమస్యల ఉద్యమాలు సాగిస్తోందని వివరించారు. భూములు, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలపై పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించిందన్నారు. సిపిఎం పోరాటాల ఫలితంగానే పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, భూములు వచ్చాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయని విమర్శించారు. కోకో, కొబ్బరి, ఆయిల్ ఫామ్, మిర్చి, పొగాకు వరి తదితర పంటల రైతుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం కృషి చేస్తోందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరందించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, వారికి పునరావాసం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, సిపిఎం, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థులు

- గతేడాదితో పోలిస్తే 4 వేల మంది తగ్గుదల
- ప్రభుత్వ విధానాల ఫలితంగా ప్రయివేటు బాటలో విద్యార్థులు
- గత నాలుగేళ్లలో 52,656 మంది విద్యార్థులు తగ్గుదల
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ విధానాలు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు క్రమేణా నిర్వీర్యమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నాలుగు వేల మందికిపైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. ఈ నాలుగేళ్ల గణాంకాలు పరిశీలిస్తే సుమారు 52 వేల మంది విద్యార్థులు తగ్గిపోయారు. దీన్ని సరి చేయాల్సిన జిల్లా విద్యాశాఖ పట్టనట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీంతో సర్కారీ బడుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

ప్రభుత్వ విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలకు వత్తాసు పలుకూ వారికి అనుకూలమైన విధానాలు అవలంబిస్తోంది. నూతన విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకొచ్చి పాఠశాలల విలీనంతో విద్యార్థులను పాఠశాలలకు దూరం చేస్తోంది. అయితే విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో జిల్లా విద్యాశాఖ పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే విమర్శలున్నాయి. డ్రాప్‌వుట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ నాగరాణి పదేపదే చెబుతున్నప్పటికీ జిల్లా విద్యాశాఖాధికారులు సరిగా స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల మనుగడే ప్రమాదంలో పడుతోంది. 2024 - 25లో జిల్లాలోని 1,492 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 89,600 మంది విద్యార్థులు విద్య అభ్యసించారు. 2025-26 సంవత్సరంలో ఈ సంఖ్య 85,344కు తగ్గింది. అంటే 4,256 మంది విద్యార్థులు తగ్గిపోయారు. ప్రస్తుతం విద్యార్థుల చేరికలు కొనసాగుతున్న నేపథ్యంలో వారి సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖ అంచనా వేస్తోంది. జిల్లాలోని 1,920 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 2,79,204 మంది విద్యార్థులున్నారు. 2024-25లో పదిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తొమ్మిది వేల మందికిపైగా 72 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యా సంవత్సరంలో మోడల్ స్కూల్స్ తీసుకొచ్చారు. ప్రైమరీలో రెండు సెమిస్టర్ల విధానం తీసుకొచ్చి చిన్న పిల్లలకు బరువు తగ్గేలా పుస్తకాల్లో మార్పులు తెచ్చారు. విద్యార్థులకు విద్యా కిట్లు అందించారు. తల్లికి వందనం ఎట్టకేలకు కొంతమేర అమలు చేశారు. అయినా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగలేదు. దీనికి కారణాలపై దృష్టి పెట్టాల్సిన విద్యా శాఖాధికారులు కనీసం స్పందించకపోగా, కలెక్టర్ ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

నాలుగేళ్లలో 52 వేల మంది విద్యార్థులు తగ్గుదల

జిల్లాలో నాలుగేళ్లల్లో గణాంకాలు పరిశీలిస్తే సుమారు 52,656 మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యారు. 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య లక్షా 38 వేలు కాగా, 2023-24లో 99 వేల మందికి తగ్గింది. 2024-25లో 89,600కు పడిపోయింది. ఈ ఏడాది 2025-26లో ఇప్పటికి 85,344 మంది ఉన్నారు. గతేడాదితో పోలిస్తే సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు తగ్గిపోయారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమవుతున్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి

జి.ప్రకాశం, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గడానికి ప్రధాన కారణం ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చడం. తల్లిదండ్రులు ఏకోపాధ్యాయ పాఠశాలల్లో తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందదని భావిస్తున్నారు. 'తల్లికి వందనం' పథకం ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకూ వర్తింపజేయడం మరో కారణం. గ్రామంలో ప్రతి పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయిస్తే ప్రభుత్వం కచ్చితంగా ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుంది. ప్రభుత్వం ఆ విధంగా ఆలోచన చేయాలి.

విద్యాహక్కు చట్టానికి తూట్లు

పిఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ఉన్నత పాఠశాలల్లో సెక్షన్‌కు 40 మంది విద్యార్థులు ఉండాలని చెబితే గత ప్రభుత్వం 40 నుంచి 59కి పెంచింది. ఈ ప్రభుత్వం దాన్ని 40 మందికి తగ్గించకుండా 53గా నిర్దేశించింది. గతంలో 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ప్లస్ 2 తీసుకొచ్చి దాన్ని 12వ తరగతి వరకూ పెంచారు. ఈ సంస్కరణల్లో భాగంగా ఆరు రకాల పాఠశాలలను తీసుకొస్తే ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు కూడా అప్పట్లో విమర్శించారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా 9 రకాల పాఠశాలలుగా చెప్పి గందరగోళం సృష్టిస్తోంది. విద్యారంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే ఒక పాఠశాలను అదనంగా పెట్టాలి. ఒక టీచర్‌ను అదనంగా ఇవ్వాలి.

ప్రయివేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు

టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి పెట్టకుండా వాటిని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక వసతులపై విస్తృతంగా ప్రచారం చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి కారణం ప్రభుత్వ విద్యా విధానమే.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారంతో విరమించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కార్మికులు ఐకమత్యంతో పోరాటం కొనసాగించడంతో ప్రభుత్వం దిగివచ్చి సమస్యల పరిష్కారానికి సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని పోరాటాల ద్వారా హక్కులు సాధించే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్మికుల ఆందోళన ఫలితంగా ఔట్‌సోర్సింగ్, నాన్ పిహెచ్ వర్కర్ల వేతనం ప్రభుత్వం పెంచినట్లు తెలిపారు. కేటగిరి 1లోని వర్కర్ల వేతనం రూ.21,500 నుండి 24,500 రూపాయలు, కేటగిరి 2లో వర్కర్ల వేతనం రూ.18,500 నుండి రూ.21,500లకు, కేటగిరి 3 వర్కర్ల వేతనం రూ.15 వేల నుండి రూ.18,500కు ప్రభుత్వం పెంచుతూ పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి నుండి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఇది కచ్చితంగా కార్మికుల పోరాట విజయమని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్నార్ హనుమాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

పొలసానిపల్లి గురుకులానికి మరమ్మతులు చేయాలి

కలెక్టర్ వెట్రిసెల్వికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్

భీమడోలు మండలంలోని పొలసానిపల్లి గురుకుల పాఠశాలకు మరమ్మతులు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్విని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ కోరారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, నాణ్యమైన విద్య అందించడంలో జిల్లా పరిషత్ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. కలెక్టర్ వెట్రిసెల్విని కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె కలిసి ఏలూరు జిల్లాలో విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలపై చర్చించారు. భీమడోలు మండలం పొలసానిపల్లిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సందర్శించానని, పాఠశాలలో కొన్ని మౌలిక సదుపాయాల కొరత ఉందని, వాటికి మరమ్మతులు చేయాలని కోరారు. తరగతి గదుల పైకప్పులు లీక్ అవుతున్నాయని, తలుపులు తుప్పు పట్టి ఉండడం, పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి ఎక్కువగా ఉండడం, శుభ్రత నిర్వహణ లోపాలున్నాయని కలెక్టర్ దృష్టికి పద్మశ్రీ తీసుకువచ్చారు. ఆ పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వెనుకబడిన తరగతులకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే ఈ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యాభ్యాసనకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రాధాన్య పూర్వకంగా మరమ్మతులు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల మెరుగుదలపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను జెడ్‌పి ఛైర్‌పర్సన్ కోరారు. అనంతరం ఈ మేరకు వినతిపత్రం అందించారు. సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హామీ ఇచ్చారు.

భారీ వర్షం... రైతుల్లో ఆనందం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



జీలుగుమిల్లి : నారుమడిలోకి చేరిన వర్షపు నీరు

అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. వర్షానికి రహదారులన్ని జలమయం అయ్యాయి. చెరువుల్లోకి, వాగుల్లోకి వరద నీరు వచ్చి చేరింది. పలుచోట్ల వరి నాట్ల మడుల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో పంటలు నీట మునిగాయి. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కునూరు :కుక్కునూరులో మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురిసింది. అప్పటివరకు ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. వర్షం కురవడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

ఆర్అండ్ఆర్ కాలనీ.. సమస్యలు బోలెడన్ని..!

ఇబ్బందుల్లో రాపాకగొమ్ముకు చెందిన 80 కుటుంబాలు

సదుపాయాలు కల్పించాలని గగ్గోలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అధ్వానంగా ఉన్న రోడ్డు

మండలంలోని చల్లవారిగూడెం పంచాయతీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీకి వారం రోజుల క్రితం వేలేరుపాడు మండలం రాపాకగొమ్ము నుంచి 80 కుటుంబాలను తరలించారు. ఆ కాలనీలో కనీస సదుపాయాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నియోజకవర్గ ఎంఎల్ఎలు తమను పట్టించుకోవడంలేదని 80 కుటంబాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏ ఒక్క సహాయం కూడా అందలేదని, ఉపాధి లేదని గగ్గోలు పెడుతున్నారు. నీటి సదుపాయం కూడా అంతంత మాత్రంగానే ఉందని, కాలకృత్యాలు తీర్చుకోవడానికి కనీసం మరుగు దొడ్లు కూడా లేని దుస్థితి అని వాపోతున్నారు. ఇళ్లు కూడా వర్షం వస్తే తడిసి పోతున్నాయని, కనీసం ఫ్యాన్లు బిగించు కోవడానికి స్లాబ్‌కు ఫ్యాన్ రింగులు కూడా లేవని, దోమల బెడద వేధిస్తుందని చెబు తు న్నారు. కనీసం దోమ తెరలు అయినా అందించాలని కోరుతున్నారు. కరెంటు సదుపాయం కూడా అంతంత మాత్రంగానే ఉందని చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆసుపత్రికి వెళ్లేందుకు ఆటో మార్గం కూడా సరిగా లేదని ఆవేదన చెందుతున్నారు.

కాలనీలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

ప్రభుత్వం నిత్యావసర సరుకులు కూడా అందించలేదని, పిల్లలను చదివించేందుకు కనీసం స్కూలు కూడా లేదని, ప్రశ్నిస్తే అధికారులు వచ్చి దురుసుగా మాట్లాడుతున్నారని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన సౌక ర్యాలు కల్పించి సమస్యలను పరిష్కరించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

కల్లుగీత కుటుంబాల ఉపాధి కాపాడాలి

కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తామని ముఖ్యమంత్రి, బెల్టు షాపులపై కొరడా జులిపిస్తామని ఎక్సైజ్ మంత్రి ఇచ్చిన ఆదేశాల ప్రకారం తక్షణమే బెల్ట్ షాపులు తొలగించి లక్షలాది కల్లుగీత కుటుంబాల ఉపాధి కాపాడాలని ఎని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. ఏలూరు సర్కిల్ గీత కార్మికుల సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో బెజవాడ వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ నిత్యం గ్రామాల్లో కళకళలాడే కల్లుగీత కుటుంబాలను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కన్నీరు పెట్టిస్తుందన్నారు. ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి తక్షణం కల్తీ రాకెట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిని కాపాడుకునేందుకు, గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఆగస్టు 18వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నామని, గీత కార్మికులందరూ మోకులు, ముస్తదులు ధరించి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సింహాద్రి ఆది నారాయణ, గుడవల్లి వెంకట మోహనరావు, బెజవాడ రామ్మోహన్, వేముల నాగేంద్ర, రొక్కం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెనుగొండ మండలానికి చెందిన యువతిపై ప్రేమపేరుతో అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు అంజూరి ప్రసన్నకుమార్‌కు తీవ్ర శిక్ష విధిస్తూ న్యాయస్థానం గట్టి తీర్పు ఇచ్చింది. నేరం రుజువు అవ్వడంతో మంగళవారం ఏలూరులోని ఐదో అదనపు జిల్లా జడ్జి మహిళా కోర్టు న్యాయమూర్తి ఆర్‌విఎన్.మురళీకృష్ణ నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. ఈ విషయాన్ని జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.వి.రామాంజనేయులు వెల్లడించారు. వివరాల ప్రకారం... పెనుగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన యువతి వ్యవసాయ కూలీగా జీవనం సాగించేది. సుమారు ఏడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ ఆమెతో ప్రేమపేరుతో సన్నిహితమై వివాహం చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాధితురాలిని విస్మరిస్తూ నిందితుడు విదేశానికి (గల్ఫ్) పరారయ్యాడు. బాధితురాలు ధైర్యంగా ముందుకొచ్చి పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ బి.మోహన్‌రావు కేసు నమోదు చేశారు. అనంతరం సిఐ జివిఎ.నాగేశ్వరరావు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రభుత్వ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.వి.రామాంజనేయులు న్యాయస్థానంలో వాదనలు వినిపించగా అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి మురళీకృష్ణ నిందితుడిపై నేరం రుజువైనందున తేల్చి ఈ తీర్పును ప్రకటించారు.



కృత్రిమకాళ్ల లబ్ధిదారులతో ఎస్‌బిఐ పెన్షనర్స్ క్లబ్ ప్రతినిధులు

'హీల్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పుట్టుకతో కాని, ప్రమాదవశాత్తు కాని కాళ్లు పోగొట్టుకొన్న వికలాంగులకు హీల్ సంస్థ ద్వారా ఉచితంగా కృత్రిమ కాళ్లను అందించి వారికి పునర్జీవితాన్ని అందించడం ఎంతో అభినందనీయమని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పెన్షనర్స్ క్లబ్, విజయవాడ ముఖ్య బాధ్యులు ఎస్.రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని హీల్ స్కూల్‌లో ఉన్న కృత్రిమ అవయవ కేంద్రంలో ఎస్‌బిఐ పెన్షనర్స్ క్లబ్ ఆర్థిక సహాయంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన 13 మంది వికలాంగులకు 14 కృత్రిమ కాళ్లను క్లబ్ ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హీల్ సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎస్‌బిఐ పెన్షనర్స్ క్లబ్ వారి ఆర్థిక సహాయంతో 21 మందికి కృత్రిమ కాళ్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సభ్యులు కెఆర్.లక్ష్మీపతిరావు, ఎంఎస్.లక్ష్మీదుర్గా, జి.కృష్ణమూర్తి, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నియోజకవర్గ పరిధిలో అనారోగ్యానికి గురై ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న పలువురికి మంజూరైన రూ.1.55 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ బడుగు బలహీన తరగతులకు చెందిన వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి - ముసునూరు

బడి బయట ఉండే పిల్లలందరూ బడిలో ఉండే విధంగా అంగన్వాడీ ఉపాధ్యాయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సిడిపిఒ పి.విజయకుమారి అన్నారు. మండలంలోని ముసునూరు, చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. అనంతరం ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ప్రస్తావించే ప్రశ్నలకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంపీ కార్యాలయ సిబ్బంది ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో పరిష్కరించాల్సిన సమస్యలను లోక్ సభలో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులు, ప్రజల నుంచి ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆహ్వానించినట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రజల నుంచి వచ్చిన వాటిలో ఉత్తమమైన కొన్ని ప్రశ్నలను ఎంపిక చేసి, వాటిని ప్రజల తరఫున ఎంపీ పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన ప్రశ్నలు రాసిన వారిని పార్లమెంట్‌కు ఆహ్వానించి, ఒక రోజు పాటు ఢిల్లీలో గ్యాలరీలో కూర్చునే అవకాశం కల్పిస్తారని తెలిపారు. ప్రశ్నలను నేరుగా 9618194377, 9885519299 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని పేర్కొన్నారు.

కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఎక్సైజ్ శాఖ ఉద్యోగి కుమారుడికి పోలీసు శాఖలో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇచ్చామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కారుణ్య నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కొవ్వూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగంలో పనిచేస్తున్న కోడుమంచిలి దేవీ రాజ్ అనారోగ్య కారణాలతో గతేడాది మృతి చెందారు. ఆయన కుమారుడికి పోలీసు శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలను అప్పగిస్తూ కారుణ్య నియామక పత్రాన్ని ఎస్‌పి అందించారు.

అనారోగ్య కారణాలతో బిసిఆర్‌బి విభాగంలో పనిచేసి మృతి చెందిన ఎఎస్ఐ మూర్తి కుటుంబానికి రూ.రెండు లక్షల చెక్కును ఎస్‌పి అందించారు. ఏలూరు డిసిఆర్‌బి విభాగంలో డివిఎస్ఎస్.మూర్తి ఎఎస్ఐగా విధులు నిర్వహించి కొంత కాలం క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన భార్య విజయలక్ష్మికి రూ.రెండు లక్షల చెక్కును ఎస్‌పి అందించారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలోని కోట దిబ్బ ప్రాంతంలో ఉన్న కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం ఒకటో పట్టణ పోలీసులు శక్తి టీమ్ సంయుక్తంగా గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకటో పట్టణ ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

25న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎపిఇపిడిసిఎల్, సిజిఆర్ఎఫ్ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన శుక్రవారం జీలుగుమిల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రమేష్ తెలిపారు. ఈ సమావేశానికి సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.రాజబాబు, స్వతంత్ర సభ్యులు ఎస్.మురళీకృష్ణ హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ సరఫరాలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

నిందితుడికి జైలు శిక్ష

ప్రజాశక్తి - ముదినేపల్లి

బైక్ దొంగతనం కేసులో నిందితుడికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గతంలో జరిగిన బైక్ దొంగతనం కేసులో పశ్చిమగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం ఉండరాజవరం గ్రామానికి చెందిన నిందితుడు వెంకటేశ్వరరావుకు కైకలూరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఎం.శివకిరణ్ విచారణ అనంతరం 164 రోజుల జైలు శిక్ష విధించారు.

ప్రజాశక్తి
ప్రతిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీలకు జెస్సి

ప్రజాశక్తి - దెందులూరు

ఇంటర్నేషనల్ స్కేటర్ భారత ప్రధాని పురస్కార విజేత ఎం.జెస్సి ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీలకు మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు కోచ్‌తో పాటు వెళ్తున్న తొమ్మిది మందిలో మండలంలోని జోగన్నపాలెం గ్రామానికి చెందిన మాత్రపు సురేష్ కుమార్తె జెస్సి ఒకరు. సౌత్ కొరియాలో ఈ నెల 23 నుంచి పది రోజుల పాటు పోటీలు జరుగుతాయి. ప్రతి రెండేళ్లకోసారి ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో విజయం సాధించాలని కుటుంబ సభ్యులు బంధువులు క్రీడా అభిమానులు ఆకాంక్షించారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో ఎఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో మహిళల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సెంటర్‌ను ఎఎస్‌పి సూర్యచంద్రరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వన్‌స్టాప్ సెంటర్‌లో అందుతున్న వైద్య సదుపాయాలు, న్యాయ పరమైన అంశాలపై కౌన్సెలింగ్, పోలీసు సేవలు, తాత్కాలిక ఆశ్రయం వంటి వాటిపై ఆయన వారితో సమీక్షించారు. వన్‌స్టాప్ సిబ్బంది సేవలను ఆయన మెచ్చుకున్నారు.

అచ్యుతానందన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - చింతలపూడి

కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్.అచ్యుతానందన్ మృతికి సిపిఐ చింతలపూడి మండల కమిటీ ప్రగాఢ సంతాపం తెలిపింది. ఈ మేరకు సిపిఐ మండల కార్యదర్శి బాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విఎస్ అచ్యుతానందన్ అణగారిన తరగతుల కోసం, కార్మిక వర్గం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన విప్లవకారులని తెలిపారు. అవినీతిని మతతత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించే వారని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చెప్పారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం పెదవేగి, పెదపాడు మండలాలకు చెందిన పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, చేపట్టాల్సినవి, సమస్యల పరిష్కార స్థితిగతులపై అధికారులతో చర్చించి సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మిథున్‌రెడ్డి అరెస్టుపై నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై నిరసనగా వైసిపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం రోడ్డులో మంగళవారం ఆందోళన చేశారు. వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెట్టి గురునాధరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర, పట్టణ అధ్యక్షులు కర్పూరం గౌరయ్య గుప్త, బివిఆర్.చౌదరి, ముప్పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం :వైసిపి ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కుట్ర అని కొయ్యలగూడెం ఎంపిపి గంజిమల రామారావు అన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా, తప్పుడు ఆరోపణలతో కేసులు నమోదు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతుందన్నారు.

'ప్రజలను మోసగిస్తున్న కూటమి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని వైసిపి పట్టణ అధ్యక్షులు కర్పూరం గురవయ్య, మండలాధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం రాజారాణి కళ్యాణ మండపంలో మంగళవారం వైసిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వైసిపి ఏలూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ గడపగడపకు తిరిగి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తుందో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. జిల్లాలో ఉత్తమ గ్రామాలు ఎంపిక చేసే ప్రక్రియలో కేంద్రం నుంచి ఎంపిక చేసిన అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంఎంఎస్) బృందం సభ్యులు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్థానిక సర్పంచి కలపర్తి వెంకటేశ్వరమ్మ, మండల ఉప అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసులతో కలిసి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రి, చెత్త డంపింగ్ యార్డు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశీలించారు. డ్రెయినేజీ వ్యవస్థ, చెత్త సేకరణ, తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. సమగ్ర నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తల్లిదండ్రులతో విభేదించి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలికను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో గస్తీ తిరుగుతుండగా ఓ బాలిక రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా నిలబడి ఉండడం గమనించారు. వెంటనే ఆ బాలికను వివరాలడగగా తాను రెండో పట్టణ పరిధిలో ఉంటానని, తల్లి మందలించిందన్న కోపంతో ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిపోతున్నానని తెలిపింది. దీంతో బాలిక తల్లిదండ్రులకు ఎస్ఐ ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న తల్లిదండ్రులకు బాలికను అప్పగించి కౌన్సెలింగ్ చేశారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మంగపతిదేవిపేట గ్రామంలో గ్రామ సచివాలయంలో ఐదేళ్ల పాటు విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న ఎఎన్ఎం కోమటికుంట పోచమ్మ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోడియం వెంకటలక్ష్మిని, డిజిటల్ అసిస్టెంట్ కారం దుర్గారావును కొయ్యలగూడెం పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ తేలే శ్రీనివాస్, రామలక్ష్మి దంపతులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎల్‌హెచ్‌పి నాగలక్ష్మి, ఆశావర్కర్లు కట్టా సువార్త, ఆబోతు అనిత పాల్గొన్నారు.

తోకలపల్లి మురుగు కాలువ గేట్లు ఎత్తిన అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

లాకులను పైకి ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

రావులపర్రు బాడవ కింద పొలాల్లోకి అధిక నీరు చేరడంతో నారుమడులు కుళ్లిపోతున్నాయని రైతుల ఆందోళనతో అధికారులు దిగొచ్చారు. ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ క్రమంలో రైతులు సోమవారం ఏలూరు మీకోసంలో కలెక్టరుకు సైతం ఫిర్యాదు చేయడం, ఎంఎల్ఎ ధర్మరాజు సైతం అధికారులు, రైతులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవడం వల్లే నీటిని నియంత్రించారు. తోకలపల్లి మురుగు కాలువపై ఒక ఖానా బల్లను పైకి ఎత్తడం వల్ల పత్తేపురం పంట కాలువలోకి ఇన్‌ఫ్లో తగ్గడం వల్ల మడుల్లో నీరంతా లాగేసిందని రైతులు బయ్యవరపు శ్రీను, తదితరులు చెప్పారు.

ఎన్ఎంఎంఎస్ విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు అర్బన్ +జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఈ ఏడాది ఆగస్టు 31లోగా న్యూఢిల్లీ కేంద్ర మానవ వనరుల శాఖ వెబ్‌సైట్ పోర్టల్‌లో నమోదు చేసుకుని దరఖాస్తులను సమర్పించాలని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ వివరాలను ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా సరిచూసుకుని పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు, ఆధార్, బ్యాంకు బుక్‌ల్లో తేడాలు ఉంటే వెంటనే సరి చేయించుకోవాలని, లేకుంటే సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ద్వారా డిఇఒ కార్యాలయంలో వివరాలను సమర్పించాలని పేర్కొన్నారు. ఈ ఏడాది 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు కూడా ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాలయాల ద్వారా రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తన బ్యాంకులో ఆధార్ నెంబర్ లింక్ చేయించుకుని డిబిటి ద్వారా నగదు జమ అయ్యేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే స్కాలర్‌షిప్ మంజూరు కాదని పేర్కొన్నారు. ఈ పథకం విధివిధానాలు ఎన్ఎంఎంఎస్ పోర్టల్‌లో పొందవచ్చని, గడువు తేదీలోగా దరఖాస్తులు సమర్పించకపోతే స్కాలర్‌షిప్ మంజూరవ్వదని తెలిపారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ఈ పథకం వర్తించదని పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరులో...

ప్రత్యేక అవసరాల పిల్లలు నిత్యం వ్యాయామం చేస్తే మానసికంగా ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని రమణక్కపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, నాగమల్లేశ్వరి, అజయ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి :ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చని జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. లోకుమూడి జెడ్‌పి హై స్కూలులో ఉన్న భవిత కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించి ప్రత్యేక అవసరాల పిల్లలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ వల్ల శారీరక అవయవాల్లో పురోగతి కనిపిస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి భవిత కేంద్రాలు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ కె.సునీత, ఐఇఆర్‌టి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని మీర్జాపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పోక్సో చట్టం, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలపై నూజివీడు రూరల్ ఎస్ఐ జ్యోతిబస్ మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై నేరాలు, మహిళలు ఎదుర్కొంటున్న హింస, వేధింపుల గురించి తెలియజేస్తూ నేరాల నివారణకు పోలీసుల సహకారం ఎలా పొందాలో వివరించారు. యువతను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, డేటా దొంగతనం సోషల్ మీడియా వేదికల ద్వారా జరిగే మోసాలపై సున్నితమైన విశ్లేషణతో హెచ్చరికలు చేశారు. విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడంతోపాటు వారు తమ హక్కులను ఎలా రక్షించుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిగురుకోట సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన చిగురుకోట సొసైటీ త్రి సభ్య కమిటీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చిగురుకోట గ్రామ సొసైటీ త్రి సభ్య కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. సొసైటీ బ్యాంకు ఛైర్మన్‌గా చలసాని జగన్మోహనరావు, సభ్యులుగా బత్రాజు శ్యామలరాజు, కుంచె వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొడాలి వినోద్ నూతన త్రి సభ్య కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ ప్రెసిడెంట్ పిండిబోయిన గంగరాజు, ప్రధాన కార్యదర్శి ముచ్చు నాగేశ్వరరావు, యూనిట్ ఇన్‌ఛార్జి కందేపి పద్మ, బూత్ కన్వీనర్లు గాతల అశోక్, తుమ్మా వీరాంజనేయులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రికి ఆక్సిజన్ కాన్సంట్రేషన్ మీటర్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మానవత జంగారెడ్డిగూడెం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మండలాధ్యక్షులు అల్లూరి రామకృష్ణ సమక్షంలో సొలస రాజకుమారి, ఆమె భర్త సొలస గుప్తా జ్ఞాపకార్థం పూర్వపు ఛైర్మన్, ఏజెన్సీ టైగర్ కరాటం రాంబాబు చేతులమీదుగా ఆక్సిజన్ కాన్సంట్రేషన్ మీటర్‌ను ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ బేబి కమలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు వజ్రకిరణ్, మహిళా వైద్యురాలు, ఆసుపత్రి సిబ్బంది, మానవత సెక్రటరీ టి.మధుకుమార్, ఉపాధ్యక్షులు గంధం గోపాలకృష్ణ, జిల్లా కన్వీనర్ త్రిపుర రమష్, మండల ఛైర్మన్ ఆకుల ధర్మరాజు, ఆడిట్ ఛైర్మన్ కేదారేశ్వరెడ్డి, రీజియన్ ఛైర్మన్ ఆంజనేయరెడ్డి, పూర్వపు అధ్యక్షులు ఎలికే తాతారావు, డైరెక్టర్ పెదవీర్రాజు, ప్రస్తుత కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని పాత చింతలపూడి గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి తుర్లపాటి బాబు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని పాత చింతలపూడి గ్రామంలో పేరుకు ఐదు బోర్లు ఉన్నాయని, వీటిలో పనిచేసేది ఒకటి మాత్రమేనని, మిగతావి నాలుగు నెలలుగా పనిచేయడం లేదని చెప్పారు. అధికారులను అడిగితే దాటవేత ధోరణి అవలంభిస్తున్నారన్నారు. స్థానిక సాయిరాం సెంటర్ వద్ద మంగళవారం గ్రామస్తులు మంగళవారం రాస్తారోకో చేశారు. గ్రామానికి నూతనంగా ఒక బోరు వేయాలని, హై లెవెల్ వాటర్ ట్యాంకును నిర్మించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో వద్దకు నగర పంచాయతీ ఎఇ రత్నాకర్, కూటమి నాయకులు కర్లపూడి రాజారత్నం వచ్చి పది రోజుల్లో కొత్త బోరు వేయిస్తామని, పాతవి రెండు రోజుల్లో బిగిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన తాత్కాలికంగా విరమించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బాబు మాట్లాడుతూ తాగునీటి సమస్యను ఆగస్టు నాలుగో తేదీ లోపు పరిష్కరించకపోతే ఐదో తేదీన గ్రామస్తులందరితో కలిసి మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పేదగర్ల బాబు, పేదగర్ల రమేష్, బోడ చిరంజీవి, గోగు మాధవ, సిపిఐ శాఖ కార్యదర్శి ముల్లగిరి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి తొర్లపాటి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ముల్లగిరి లాజరు, మండల కౌన్సిల్ సభ్యులు ముల్లగిరి అలెగ్జాండర్, ఎఐవైఎఫ్ నాయకులు నక్క వంశీ, గట్టు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తాగునీటి సమస్య ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ దృష్టికి రావడంతో ఆయన స్పందించి ఆ ప్రాంతంలో మరో కొత్త బోరు వేయాలని అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారమయ్యేవరకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని సూచించారు.

సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

ప్రపంచ మామిడి దినోత్సవంలో ఉద్యాన శాఖాధికారులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని మామిడి పరిశోధన స్థానంలో ప్రపంచ మామిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యాన శాఖాధికారులు, గ్రామీణ ఉద్యాన సహాయకులు, అభ్యుదయ రైతులకు మామిడి ఎగుమతులు పెంపొందించడానికి మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బికెఎం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏలూరు జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ పాల్గొని మాట్లాడుతూ మామిడిలో కొమ్మ కత్తిరింపులు, ఎరువుల నిర్వహణ కోసం ఒక హెక్టారుకు రూ.1.20 లక్షల రాయితీ ఉందన్నారు. మామిడిలో ముందస్తు పూత రావడానికి సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా ఉద్యాన శాఖాధికారి పి.బాలాజీకుమార్ మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలంలో మామిడి రైతులు సంఘటితగా ఉండటం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన పురుగుమందులు ఎఫ్‌పిఒ ఆధ్వర్యంలో వాడుకుని తద్వారా నిర్వహణ ఖర్చులు తగ్గి లాభాలు పొందాలని తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

చెరుకువాడ సువర్ణ రాణి, భర్త, సంతోషరావు, డోర్ నెంబర్ 29-3-29, యాళ్ళవాని గరువు, పాలకొల్లు రూరల్ పంచాయతీ, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా కుమార్తె మేరీ రోసీ సొంత ఇంటి స్థలం డాక్యుమెంట్స్ ఆర్ఎస్ నెంబర్ 275/2,280/2, 280/3, మొత్తం 222.22 చ.గజములు దగ్గరలో 8-1 డోర్ నెంబర్, పామూరు గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా, డాక్యుమెంట్ నెంబర్ 9686/2023, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, పాలకొల్లు ద్వారా 22-9-2023 తేదీన సంక్రమించినది. ఈ డాక్యుమెంట్ జెరాక్స్ తీయించుటకు ది.22-02-2025న మాఇంటి నుంచి యడ్లబజార్ సెంటర్‌లో జెరాక్స్ కాపీలు తీయించుటకు స్కూటీ పై వెళుతుండగా దారిలో పడి పోయినవి. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 6309285456

ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నర్సాపురం వారి కోర్టులో
H.M.O.P.No.137/2024

బిట్వీన్:
వాసా రాజశ్రీ అనే తాళ్ల రాజశ్రీ ...Petitioner
అండ్
వాసా సురేష్‌కుమార్ ...Respondent
టు,
వాసా సురేష్, తండ్రి గంగాధర్ రావు, వాలమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.

పై నంబరు పిటిషనులో పిటిషనరు మీ నుండి విడాకులు కోరుతూ పై కోర్టులో దాఖలు చేసి, పై కోర్టు నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు పిటిషనరును ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ్యంలో నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. అందుకు శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం Substitute సర్వీస్ గా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు ది.7-8-2025 సం. తేదీన వాయిదా వేసియున్నారు. కావున ది.7-8-2025 సం.తేదీన ఉదయం 10 గంటలకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని శ్రీకోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

గూడూరి శంభూప్రసాద్
నరసాపురం అడ్వకేట్, నరసాపురం/పాలకొల్లు
తేది.16-07-2025 సెల్: 9490988095

పేరు మార్పు ప్రకటన

కొల్లాబత్తుల నరేష్, తండ్రి గణేష్ (కొత్తపేరు) డోర్‌నెం.1-128/1 పెదపేట, చర్చ్ దగ్గర, మత్స్యపురి గ్రామం, వీరవాసరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరు కొల్లాబత్తుల నరేష్, తండ్రి గణపతి (పాతపేరు) నుండి కొల్లాబత్తుల నరేష్, తండ్రి గణేష్ (కొత్తపేరు)గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

కొల్లాబత్తుల నరేష్, తండ్రి గణేష్,
డోర్‌నెం.1-128/1, పెదపేట, మత్స్యపురి,
వీరవాసరం మండలం, ప.గో.జిల్లా.

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.11/2024 in
O.S.No.58/2013

DHR : చీపురుపల్లి పార్వతి
And
JDR :
పోతుల వెంకటనాగ రంగ రవికుమార్ వగైరా
JDRS : 1. పోతుల వెంకటనాగ రంగ రవి కుమార్, S/o.సుబ్బారావు, డోరునెం.3-13, రాయలం గ్రామం, భీమవరం మండలం.
2.పోతుల వైజయంతి, W/o.వెంకటనాగ రంగ రవికుమార్, డోరునెం.3-13, రాయలం గ్రామం, భీమవరం మండలం.

పై నెంబరు పిటీషను నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొనివుండుట లేదు. అందువలన మీరు ది.04-09-2025 సం.రం. తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

భీమవరం కె.వి.రమేష్, భీమవరం
తేది.18-07-2025 DHR తరపు న్యాయవాది.

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), వారి కోర్టులో, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
I.A.No.207 of 2024 in
O.S.No.44 of 2020

Between :
భల్లే రామకృష్ణ ...Plaintiff
And
కట్టా దుర్గాలక్ష్మి and 2 Others ...Defendants
To.
శ్రీమతి వేముల సావిత్రి, W/o.లక్ష్మణరావు, మేజర్, ఆడ, కొండయ్య చెఱువు, శేషమహల్ దగ్గర, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా - 534101.

పై నెంబరు గల గ్రంథములో దావా మరియు పిటీషన్ విచారణలోవున్నది. మరియు మీరు దావాలో 3వ ప్రతివాదిగా మరియు పిటీషన్‌లో 3వ రెస్పాండెంట్‌గా వున్నారు. మీ నాన్నగారు నా క్లయింటు (వాది) వద్ద డబ్బులు తీసుకొని అదేరోజున అనగా తే.12-7-2019 దిన ప్రామిశరీ నోటు వ్రాయించి ఇచ్చియున్నారు. కావున పై విషయములో నా క్లయింట్ భల్లే రామకృష్ణ అనువారు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జంగారెడ్డిగూడెం నందు మీ నాన్న గారి మరణానంతరం పై దావా మీపై వేసియున్నారు. ఈ విషయంలో గౌ॥శ్రీకోర్టు వారు అనేక పర్యాయములు సమన్లు పంపియున్నారు. మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక పోవుట వలన శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం తే.06-08-2025 దిన వాయిదా వేసియున్నారు. అని తెలియజేయుట జరిగినది. కావునా తే.06-08-2025 దిన ఉదయం 10.30 గంటల లగాయితు మీరు స్వయముగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీకోర్టు వారు మీ పరోక్షముగా నిర్ణయం తీర్మానించబడును.
వాయిదా తేది:06-08-2025

కొల్లూరు సతీష్, అడ్వకేట్,
జంగారెడ్డిగూడెం.

I.A. నోటీసు
భీమడోలు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
I.A.No.42/2024 in O.S.No.76/2023

మధ్య :
బొప్పన కోటేశ్వరరావు ...పిటీషనర్ /వాది
మరియు
బొప్పన విజయభాస్కరరావు మరియు 13 ఇతరులు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
R4-Dharmana Naresh, S/o.Naga Raju, Resident of Near Kanalamma Water Tank, Kovvali Village, Denduluru Mandal, Bhimadole JCJ.
R5-Dharmana Subbamma, D/o.Naga Raju, Resident of Near Kanalamma Water Tank, Kovvali Village, Denduluru Mandal, Bhimadole JCJ.
R8 - Lakshmimsetti Parvathi, W/o.Prasad, Kothuru, Resident of Kovvali Village, Denduluru Mandal, Bhimadole JCJ.
R9-Lakshmimsetti Durga Devi, D/o.Prasad, Kothuru, Resident of Kovvali Village, Denduluru Mandal, Bhimadole JCJ.
R12- Boppana Srinu @ Srinivasa Rao, S/o.(Late) Subba Rao, Resident of D.No.20E-1-20, Chodididda, Eluru, Eluru EJCJ.
R13- Boppana Peasu, S/o.(Late) Subba Rao, Hindu, Male, Aged 35 Yrs, Resident of Pallapuru Village (M.M.Puram), Bhimadole Mandal, Bhimadole JCJ.

పై దావాలో 2వ ప్రతివాది కాలం చేసినందున దావా ప్లెయింట్‌లో తగు అమెండ్‌మెంట్ చేయగలందులకు అనుమతి కోరుచూ పై ఐ.ఎ.నెం.42/2024 పిటీషను దాఖలు చేసినందున యిందు విషయమై ఆక్షేపణలున్న ది.31-07-2025న పగలు 10 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పైకోర్టులో హాజరై కోర్టు వారితో మనవి చేసుకోని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయడమగును. ఈ పేపరు ప్రకటన శ్రీకోర్టు వారి ది.17-6-20025 ఉత్తర్వుల అనుసారమైయున్నది.
ముఖ్య గమనిక: న్యాయసేవాధికార సంస్థ ద్వారా అర్హతను బట్టి ఉచిత న్యాయ సహాయం కూడా అందుబాటులో కలదు.

శియ్యాద్రి జగదీశ్వరరావు
పిటీషనర్/వాది తరపు న్యాయవాది
ఏలూరు పవర్‌పేట, ఏలూరు.
తేది: 23-07-2025 సెల్: 8956899999